# శిక్ష

## న్యాయపతి రాజగోపాలం

సెకండు క్లాసు లేడీస్ కంపార్టుమెంటులో పోర్టరు పెట్టె, బెడ్డింగు పెట్టి వెళ్లాడు మాలతి లోపలికి వెళ్లి కూర్చొన్నది ఆమె తప్ప ఆ కంపార్టుమెంటంతా ఖాళీగా ఉన్నది

మాలతి బి. ఏ. చదివింది ఆ క్రిందటి రోజుతో పరీక్షలు ముగిశాయి ఆ వెంటనే ఇంటికి ప్రయాణానికి ప్రయత్నం, అందులో రెండు టీ పార్టీలు కూడా, రాత్రంతా హాస్టలులో ఒకటే సందడి ఎలాగైతేనేం చివరికి ఉదయాన్నే వచ్చి రైలులో పడింది. మళ్లా ఇల్లు, పాప, అమ్మ, నాన్నగారు—

రెండు నెలలనుండి తదేకదీక్షతో చదవడం నుండి మాలతికి ఇంటి గురించి ఆలోచించడానికే అవకాశం లేకపోయింది. చదువు తప్ప తక్కిన ప్రపంచాన్నే మరిచిపోయింది ఈనాటికి తిరిగి ఈ లోకంలోకి వచ్చింది.

ఇంటి సంగతి ఆలోచించేసరికి మొదట అక్క జ్ఞప్తికి వస్తుంది మాలతికి

అక్క మరణించి అప్పుడే మూడు సంవత్సరాలు కావస్తోంది అనుకొన్నది, మాలతి ఆమె కళ్లు చెమ్మగిల్లాయి కాలచక్రం ఎంత గిర్రున తిరిగిపోతోంది ! అక్క బుగ్గమీది పెళ్లి బొట్టు తన కళ్లకి కట్టినట్టే ఉన్నది కాని అక్కకి వివాహమయి అప్పుడే ఎనిమిదేళ్ళు కావస్తోంది

చిన్నప్పటినుండి అక్క, తను ఎంతో అన్యోన్యంగా ఉండేవారు తక్కిన అక్కా చెల్లెళ్ల మాదిరి కాదు— ఒక్కసారైనా పోట్లాడుకోవడం ఎరగరు. ఇద్దరిలోనూ తనే కాస్త పెంకెతనం చేసేది. తనకే ఎప్పుడైనా ఒక్కొక్కసారి అక్కపైన కోపం వచ్చేది కాని, అక్క ఎంతో శాంతంగా ఉండేది నిముషంలో తన కోపం పోగొట్టేది. ఇద్దరూ కలిసి ఆడుకొనేవారు, కలిసి చదువుకొనేవారు, కలిసి పడుకొనేవారు కథలు చెప్పుకొనేవారు, కన్నె నోములు నోచుకొనేవారు

స్కూలుఫైనలు ప్యాసు కావడంతో పెద్దమ్మాయి చదువు మాన్పించారు వాళ్ల నాన్నగారు మాలతి అప్పటికి ఫోర్తుఫారంలోకి వచ్చింది. అక్కని చదువు మాన్పించడానికి ధనలోపమే ముఖ్య కారణం. అప్పట్లో వాళ్ల తండ్రి గుమాస్తాగిరి చేస్తుండేవాడు. ఆయనకి ఇద్దరే సంతానం. పరిమితమైన కుటుంబమే. అయినా అతడు తెచ్చే జీతం నిత్యావసరాలకి మాత్రం బహు కష్టంతో సరిపోయేది. ఇక పెద్ద చదువు చదివించడానికి ఏం మిగులుతుంది ? మాలతి తల్లి మాత్రం అయిన ఇంటివారి ఆడబడుచు కాని ఆమె తండ్రి మహా లుబ్ధుడు. పసుపు కుంకం కొనుక్కోమని కూతురి చేతిలో ఎన్నడూ ఒక్క రూపాయి కూడా పెట్టడం రివాజులేదు అందుచేత మాలతి తండ్రికి అత్తవారి ఆశ ఎన్నడూ లేదు.

పెద్దకూతురికి పదహారేళ్లు పూర్తికావడం నుండి ఆమె వివాహం గురించి తల్లిదండ్రులకి ఆతృత అధికమైంది. కొన్ని సంబంధాలు చూచారు అందరూ పెద్ద మొత్తాలుగా సొమ్ము ఆశించినవాళ్లే. ఎక్కడనుండి తేగలరు ? అప్పటికి వాళ్ల తండ్రి ఒకసారి తన మామగారి వద్దకు వెళ్లి అర్థించాడు. ముసలాయన ఏ కళ నున్నాడో పెళ్లి ఖర్చులకి మాత్రం ఒక వెయ్యి రూపాయలు ఇస్తానన్నాడు మరి కట్నం ? ఎవరైనా కట్నం కోరకుండా వివాహం చేసుకొంటే ఈ వెయ్యిరూపాయలతో వివాహం జరుగుతుంది, లేకపోతే లేదు అన్న నిస్సహాయ పరిస్థితిలోకి వచ్చారు మాలతి తల్లితండ్రులు.

అప్పట్లో బావని భగవంతుడే పంపాడు

బావ బి ఏ. ప్యాసయినా మాలతి తండ్రిలా గుమాస్తా ఉద్యోగమే చేస్తూండేవాడు అతడికి ఇరస్తా పరస్తా ఎవరూ లేరు తనకి కట్నం అవసరం లేదని, పిల్ల నచ్చితే చాలని చెప్పాడు అతడికి అక్క నచ్చింది తాతగారిచ్చిన వెయ్యి రూపాయలతో వివాహం జరిగింది

పెళ్లినాడు అక్క ఎంత అందంగా కన్పించింది ? ఆమెతో మాలతి ఆమాట చెప్పింది కూడా

“నీ పెళ్లినాడు నాకంటే వెయ్యిరెట్లు అందంగా నువ్వు మెరిసిపోతావ్ !” అన్నది అక్క నవ్వుతూ

పెళ్లి అయిన వెంటనే అక్కని బావ తీసుకు వెళ్లిపోయాడు అక్క వెళ్లిపోయాక ఇల్లు ఎంతో చిన్నపోయింది మాలతికి జ్ఞానం వచ్చినప్పటినుండి అక్కని విడిచిపెట్టి ఒక్కరోజు కూడా ఇప్పటి వరకు లేదు తల్లితండ్రుల ముఖాలలో కూడా దిగులు కనిపించింది అక్క క్షేమంగా చేరినట్టు, కులాసాగా ఉన్నట్టు ఉత్తరాలు వస్తూంటే ఒక్కొక్కరి మనస్సులు కొంత కుదుటబడ్డాయి క్రమంగా అక్క లేకుండా కాలం గడపడం మాలతికి అలవాటయింది

అయితే బావ అక్కని తరచు తీసుకొని వచ్చేవాడు ప్రతీ శనివారం, ఆదివారాల్లో ఇద్దరూ వచ్చేవారు ఇక పండుగలకి సరేసరి వాళ్లు వచ్చినప్పుడు తిరిగి ఇల్లు ఎంత కళకళలాడుతూ ఎంత సందడిగా ఉండేది ! అంటే సందడి అంతా అక్కదే బావ మాత్రం ఎవరితోనూ మాట్లాడడు ఎంతసేపు గదిలో కూర్చొని ఏదో చదువుకొనేవాడు అతడి నైజమే అది ఇంట్లో ఉన్నాడనే ఎవరికీ తెలియదు.

“ఏమే, ఎప్పుడూ అతడు అదోలాగ ఉంటాడు ప్రసన్నమయిన మనిషిలా కనిపించడు. నీతోనైనా సరిగ్గా ఉంటాడా ?” అని ఒకసారి అక్కని అడిగింది తల్లి.

“ఆయనకేమమ్మా చాలా దొడ్డమనిషి నన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తారు” అన్నది అక్క.

“ఆ వేషమేమిటి ? ఎప్పుడూ ఖద్దరు గుడ్డలే. బి ఏ. ప్యాసయినాడు పాటివాళ్లలా ఆమాత్రం నాజూగ్గా బట్టలు వేసుకొంటే నేం ?” అన్నది అమ్మ.

“ఆయనకి కొన్ని నియమాలు ఉన్నాయమ్మా. సులువుగా అర్థమయ్యే మనిషి కారు” అన్నది అక్క.

అక్క చెప్పింది అమ్మకి తృప్తి నిచ్చేది కాదు. ఆమెది తల్లి హృదయం. కుమార్తె సుఖపడడం లేదేమోనని ఆమె ఆతృత అందులోనూ ఇద్దరు పిల్లల్నీ రెండు కళ్లలా చూసుకుంటూ పెంచింది. వాళ్లు ఏదంటే దానికే తల వూపేది. తండ్రి కూడా అంతే

రైలు శరవేగంతో పరుగెడుతోంది. ఏదో వినబడని పాటకి అంతంలేని లయ వేస్తున్నాయి చక్రాలు గత చరిత్రలో పుటలు తిరగవేస్తున్నది మాలతి

అక్క వివాహం జరిగాక కొన్ని ముఖ్యమయిన మార్పులు కలిగాయి. మాలతి తాతగారు మరణించారు. ఆస్తిలో వాటా వస్తుందని భార్యచేత ఆమె అన్నదమ్ములకి నోటీసు ఇప్పించాడు మాలతి తండ్రి మొదట్లో కాస్త బెట్టుసరిగా తిరిగి జవాబు ఇచ్చినా, చివరికి వాళ్లే రాజీనామాకి వచ్చారు. సాలీనా మూడువేల రూపాయలు ఆదాయం వచ్చే ఆస్తిని మాలతి తల్లికి ఇచ్చారు. మాలతి తండ్రికి ఎకాంటెంటుగా ఉద్యోగంలో ప్రమోషను వచ్చింది ఇన్నాళ్లూ వాళ్ల ఇంట్లో స్థిరనివాసం ఏర్పరచుకొన్న దారిద్ర్యం ఒక్కసారిగా పటాపంచలయింది తన చదువు కూడా స్కూలు ఫైనలుతో ఆగిపోతుందేమోనన్న భయం మాలతిని వదిలిపోయింది ఆమెను పెద్ద చదువు చదివించాలని, మంచి సంబంధం చూచి పెళ్లి చెయ్యాలని ఆమె తల్లిదండ్రులు నిశ్చయించారు. ఇల్లు కొత్త శోభతో కళకళలాడడం మొదలెట్టింది. అందరి హృదయాలు ఆనందంతో నిండాయి.

నాలుగు సంవత్సరాలు గడిచాయి. మాలతి పి యు సి. చదవడానికి పట్నం వచ్చింది. ఎన్ని సంవత్సరాలయినా అక్కకి సంతానం కలగడం లేదని అమ్మకి ఒక కొత్త దిగులు పట్టుకొన్నది. అది నానాటికి ఎక్కువ కావటం మొదలెట్టి చివరికి ఒక ఆతృతగా ఆమెను వేధించసాగింది ఎవరితో మాట్లాడినా ఆమె తప్పక ఇదే ప్రసక్తి తీసుకువచ్చేది. మాలతికి వ్రాసే ప్రతీ ఉత్తరం లోనూ అదేమాట

చివరికి అమ్మ కోర్కె ఫలించింది ! అక్క నెల తప్పిందని అమ్మవద్ద నుండి అనుకోకుండా ఒకరోజు మాలతికి ఎక్స్‌ప్రెస్ ఉత్తరం వచ్చింది మాలతి ఆనందం పట్టలేకపోయింది ఒక కిలో మిఠాయి వెంటనె కొని అక్కగారి వూరు వెళ్లింది

మాలతిని అక్క, బావ ఎంతో ఆప్యాయంతో ఆదరించారు ఆ దంపతుల ముఖాల్లో ఆనంద రేఖలు ఆమెకి స్పష్టంగా గోచరించాయి. ఎన్నడూ లేనిది బావ చాలాసేపు సరదాగా మాట్లాడాడు.

[illegible] అక్కని [illegible] చెయ్యాలని మాలతి ఆ ఒక్క సారే విన్నది. ఆరోజు ఎంతో ఆనందంగా గడిచి పోయింది. మర్నాడు మాలతి తిరిగి పట్నం వెళ్ళి పోయింది.

పురిటికి అక్కని తీసుకుని రాబోతున్నామని, ఆ తరువాత ఆమెను తీసుకువచ్చామని, ఆమె ఆరోగ్యం బాగున్నదని, చులకనగా తిరుగుతున్నదని, ఎప్పటికప్పుడు అమ్మవద్దనుండి ఉత్తరాలు వస్తుండేవి. ఒకటి రెండుసార్లు అక్క కూడా ఉత్తరాలు వ్రాసింది అంతా సవ్యంగానే, బాగానే, ఉన్నదను కొన్నది మాలతి కాని—

ఒకరోజు, ఆరోజు, అనుకోకుండా నాన్నగారు హాస్టలుకి వచ్చారు ఆయన ముఖం వెలవెల బోతున్నది రాత్రి నిద్ర లేకపోవడం నుంచి కాబోలు కళ్ళు ఎర్రగా ఉన్నై. మాలతి మనస్సు వెంటనే కీడు శంకించింది.

"ఏం—ఏం నాన్నగారు ?" అని ప్రశ్నించింది మాలతి, ప్రాణం బిగబట్టి.

"త్వరగా రా అమ్మా. అక్క పరిస్థితి ఏమీ బాగులేదు ఇక్కడికి టాక్సీలో తీసుకువచ్చి ఇప్పుడే పెద్ద ఆస్పత్రిలో చేర్పించాం" అన్నారు.

*వెంటనే తల్లివెంట మాలతి బయల్దేరింది* వివరాలు త్రోవలో నాన్నగారు చెప్పారు. రెండు రోజులనుండి అక్కకి లేబర్ ప్రారంభమయిందట. ఎప్పటికీ పురుడు రాదు డాక్టరు వచ్చి చూచిందట ఏవో ప్రయత్నాలు చేసిందట. చాలా క్లిష్టమైన కాన్పు అని, ఆపరేషను చెయ్యాలని, పెద్ద ఆస్పత్రికి తీసుకువెళ్లమని చివరికి సలహా యిచ్చిందట

"ఆమాట మొదటే చెప్తే ఎంత బాగుండేది" అన్నారు నాన్నగారు జీరస్వరంతో

"బావకి తెలియజేశారా ?" అన్నది మాలతి

"ఇక్కడికే వరాసరి రమ్మంటూ రాత్రి టెలిగ్రాం ఇచ్చాను గంటకో, ఘడియకో అతడు కూడా రావచ్చును" అన్నాడు తండ్రి

ఇద్దరూ ఆస్పత్రి చేరేసరికి బావ అక్కడ సిద్ధంగా ఉన్నాడు. మాలతి తల్లి, అతడు, తని ఖీలగది బయట నిలబడి దిగులుగా ద్వారంవైపు చూస్తున్నారు.

తనిఖీ పూర్తికాగానే స్ట్రెచర్ పైన అక్కని ఆపరేషన్ ధియేటరులోకి తీసుకొని వెళ్లారు

అక్క ముఖం బాధతో నల్లగా కమిలిపోయింది స్ట్రెచర్‌మీద నుండి ఒక్కసారి కళ్ళు విప్పి చూచింది. ఆమెకు మొదట మాలతి కన్పించింది వెంటనే ఆమె ముఖంలో ఒక చిన్న వెలుగు కన్పించింద. ఆ తరువాత బావ ఆమెకు కన్పించాడు ఆమె కళ్లనుండి బొట బొట నీళ్లు జారినై. చేతులు జోడించి నమస్కరించడానికి ప్రయత్నించింది

పెద్ద సన్నాహంతో అక్కకి ఆపరేషన్ చేశారు తల్లిని–పిల్లని రక్షించడానికి ఆరోజంతా మృత్యువుతో హోరాహోరి పోట్లాడారు కొంత వరకు కృతకృత్యులయ్యారు అంటే బిడ్డని దక్కించగలిగారు కానితల్లి

'అప్పుడే పి మూరేళ్ల బ్రతుకు పూర్తిఅయి



పోయిందా అక్కా!" అంటూ మాలతి ఏడ్చింది. తల్లి తండ్రుల రోదన సరేసరి

బావ చాలవరకు దుఃఖాన్ని నిగ్రహించు కోవడానికి ప్రయత్నించాడు. కాని చివరికి మృత కళేబరంపై పడి చిన్నపిల్లాడిలా భోరున ఏడ్చాడు.

అంత్యక్రియలు జరిపించి అమ్మ నాన్నగారు తిరిగి వెళ్ళి పోయారు. వాళ్ళతో బావ, మాలతి కూడావెళ్ళారు.

ఇంట్లో తిరిగి కాలుపెడుతూ అమ్మ గొల్లుమన్నది దానితో ఎవరికి దుఃఖం ఆగలేదు ఆరోజంతా అందరి మనస్సులు చీకటితో నిండిపోయినై

ఇంచుమించు అయిదు సంవత్సరాలనుండి అక్కతను ఇంటిలో లేదు బావ వద్ద ఉండేది అయినప్పటికీ ఇల్లు అదో నిండుగా ఉండేది ఇప్పుడు ఇల్లు బోరుమంటున్నది ఇంట్లో ఏవైపు చూచినా మాలతికి అక్క జ్ఞాపకం వచ్చేది ఆయింట్లోనే చిన్నప్పుడు ఇద్దరూ ఆడుకొనేవారు ఆతరువాత కలిసి చదువుకొనేవారు ప్రతి సంవత్సరం బొమ్మల కొలువు పెట్టేవారు బొమ్మల కొలువు అంటే ఎంత సంబర పడేదానివే అక్కా! ఆయింట్లోనే అక్కవివాహం జరిగింది. ఏది చూచినా ఎటువైపు చూచినా, మాలతికి అక్కే దృష్టికి వస్తూండేది

ఇక ఒక్క క్షణం కూడా ఇక్కడ గడపడం కష్టం ఇవేవో— ఈ రోజులేవో పూర్తికాగానే తిరిగి కాలేజికి వెళ్ళి పోవాలనుకొన్నది మాలతి

చివరికి మాలతి వెళ్ళేరోజు సమీపించింది బావ కూడా ప్రయాణమవుతున్నాడు కాని అతడి మనస్సులో ఏదో బాధ పీడిస్తున్నది అతడు మాలతిని సమీపించాడు

"నేను —నేను వెళ్ళి పోవాలను కొంటున్నాను మాలతీ కాని పాప మాట ఏమిటి?" అన్నాడు ముఖం దించుకొని

మాలతి వెంటనే వెళ్ళి తండ్రితో చెప్పింది ఆయన బావని పిలిచాడు.

"నీకొక తల్లా, తోబుట్టువా, ఎవరున్నారుగనుక? మా ఇద్దరికి ఆయుర్దాయం ఉన్నన్నాళ్ళు మేమే పెంచుతాం నీకు దానిని చూడాలని బుద్ధి పుట్టి నప్పుడల్లా నిరభ్యంతరంగా వస్తూండు" అని చెప్పారు

బావ మారు మాట్లాడకుండా ఆరోజే వెళ్ళి పోయాడు మాలతి ప్రయాణం ఆ మర్నాడు ఉదయం రైలుకి

ఆరాత్రి మాలతికి ఎప్పటికీ నిద్ర పట్టలేదు ఎన్నో ఆలోచనలు దానికి తోడు అడపా దడపా పాప ఏడుస్తున్నది

అక్క చనిపోయిన తరువాత ఇల్లు చిన్న బోయినా నిశ్శబ్దంగా మాత్రం లేదు అనుకొన్నది మాలతి తల్లి మరణించినట్లు ఈపసి గుడ్డుకి తెలిసిందో ఏమో, ఒకటే ఏడుపు ఎవరు ఎంత ప్రయత్నించినా వూరుకొనేది కాదు— ఒక్క మాలతి తప్ప. పాపని తలుచు కొంటే మాలతి గుండె తరుక్కు పోతున్నది. పుట్టుక తోటే భగవంతుడు దానికి తీరని లోటు కల్పించాడు తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ పాపకి ఆలోటు కన్పడనివ్వను అనుకొన్నది

మాలతి ఆమెలో మాతృత్వం ఉప్పొంగింది వెంటనే లేచి పాపని ఉయ్యాలనుండి తీసి హృదయానికి హత్తుకొన్నది.

"నేనే మీ అమ్మ అనుకొంటూన్నావా పిచ్చితల్లీ అందుకేనా నేను పోదాక్కా వరకు నీ ఏడ్పు తగ్గించవ్?" అన్నది.

పాపని తిరిగి పడుకో బెట్టి మాలతి వెళ్ళి తన మంచం పైన పడుకొన్నది "పాప నాబిడ్డ, పాప నాబిడ్డ" అనుకొంటూ చివరికి నిద్రపోయింది

ఆనిద్ర లోనే కల వచ్చింది

కలలో అక్క కన్పించింది పూర్తిగా అలంకరించు కొన్నది కాని ముఖం మాత్రం ఎల్లగా, బాధగా ఆ చివరిరోజులా— కన్పించింది చేతులు తిప్పుతూ, ఏదో తెలియని భాషలో మాలతికి ఏదోచెప్తున్నది

మాలతికి ఒక్క అక్షరం కూడా బోధ పడలేదు

అక్క ఇంకొక సారి చెప్పింది ఈసారి ప్రతిమాట విడివిడిగా చెప్పింది చేతులతో, కళ్ళతో, ముఖంతో కూడా సౌంజ్ఞలుచేసింది కాని అదేభాష ఆమె ఏమిటి చెప్తున్నదో మాలతికి ఈసారి కూడా బోధపడలేదు

"ఏమిటంటున్నావో నాకు తెలియడం లేదక్కా" అన్నది మాలతి. అక్క పళ్ళు పటపట కొరికింది ఆమె కళ్ళలో నుండి కోపం ప్రవహించింది తన మెడలోని మంగళసూత్రాలు తీసి మాలతి పైన విసిరి కొట్టింది అవి మాలతి భుజం మీద పడినై వెంటనే పాంగా మారి పోయాయి మాలతి వెంటనే పాపని ఎత్తుకొన్నది ఆమెకు కొంత అర్థమైంది

"పాపని గురించి చెప్తున్నావా? నీ కూతురిని గురించి నువ్వేమీ దిగులు పడొద్దు అక్కా దాని బాధ్యతనాది. ప్రమాణం చేసి చెప్తున్నాను. అది నాబిడ్డ. నాకు తెలియని భాషలో చెప్తే ఎలా అర్థం అవుతుందిచెప్పు దానికోసం అంత కోపం తెచ్చుకోవాలా? నువ్వు జీవిస్తూండేప్పుడు నాతో కోపంగా మాట్లాడావా?" చనిపోయాక నాపైన కోపంతెచ్చుకొంటున్నావా? అంటూ మాలతి వలవల ఏడ్చింది.


అక్క ముఖంలో కోపం మాయమైంది -ఆమె కళ్ళవెంట నీళ్ళు కారడం ప్రారంభించినై. మాలతి వైపు దీనంగా చూస్తూ అలా కొంతసేపు దుఃఖించింది తరువాత అంతర్ధానమైంది.

మాలతి గజగజ వణికిపోతూ నిద్ర మేల్కొన్నది. కన్నీరుతో తలగడ తడిసిపోయింది

మర్నాడు ఉదయం మాలతి పట్నం వెళ్ళి పోయింది. తిరిగి చదువులోపడి దుఃఖం కొంతవరకు మరిచి పోయింది కాని, ఆ కల మాత్రం ఆమె మనస్సులో గాఢంగా నాటుకున్నది.

రైలు ఏదో స్టేషనులో ఆగింది ఒక గుజరాతీ స్త్రీ ఇద్దరు పిల్లలతో సహా ఆ పెట్టెలో ప్రవే శించడంతో మాలతి ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఒక నిట్టూర్పు విడిచి కిటికీలోనుండి స్టేషను పేరు చదివింది. ఇంకొక రెండు స్టేష నులు దాటితే తన వూరు వస్తుంది ఆ గుజరాతీ ఆమె కొడుకు—ఏడెనిమిది ఏళ్ళుంటాయి— పైన బెర్తు ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్నాడు. తల్లి ఒడిలో కూర్చొన్నది ఆడపిల్ల, మూడేళ్ళే ఉంటాయి పాప ఈడుదే కొనుమరి పాపకి కూడ మూడేళ్ళ వయస్సు వస్తున్నది అక్క చనిపోయి అప్పుడే మూడు సంవత్సరాలు కావస్తోంది

పాపని తలచుకోగానే మాలతి హృదయం ఆనందంలో నిండిపోయింది ఈపాటికి తనకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ ఉంటుంది తనకు



కూడా శలవులు ఎప్పటికి వస్తాయా అనిపించింది. ఇక తను యింటికి వెళ్ళినప్పటినుండి పాప ఒక్క క్షణం కూడా వదలదు. అసలు తను కూడా పాపని వదల్లేదు. పాప తనవద్దనే పడుకొంటా నంటుంది. తనే దానికి కథలు చెప్పాలి—తనే తల దువ్వి, స్నానం చేయించి బట్టలు కట్టాలి. తనే బువ్వ కలిపి తినిపించాలి. పిన్నీ, పిన్నీ అంటూ ఇక ఏవో పిచ్చి కబుర్లు చెప్తూనే ఉంటుంది

ఈ మూడేళ్ళలో చెప్పుకోదగ్గ మార్పులు కొన్ని వచ్చాయి అనుకొన్నది మాలతి, పాత చరిత్ర లోకి తిరిగి వెళ్తూ. నిన్నటితో తన బి. ఏ. చదువు ముగిసినట్టే. నాన్నగారు ఈమధ్య చిన్న గజిటెడ్ ఉద్యోగానికి ప్రమోట్ అయ్యారు అక్క లేదన్న లోటు తప్ప ఇల్లు సిరిసంపదలతో తుల తూగుతున్నది. బావకి కూడా అప్పర్ డివిజన్ వచ్చింది.

కాని, బావ మునుపటిలాగ పాపని చూడడానికి రావడం మానేశాడు.

మొదట్లో పాపని చూడడానికి తరుచు వచ్చే వాడు బావ కాని, రానురాను అతడి రాక తగ్గి పోయింది ఎప్పుడైనా వచ్చినా, మాలతి శలవుల్లో ఇంటికి వచ్చిన రోజుల్లోనే వచ్చేవాడు దానికి కారణం మాలతికి క్రమంగా బోధపడింది అమ్మ అతడిపట్ల మునుపటిలా ప్రవర్తించడంలేదు. ఆమెకి ఇప్పుడు అతిశయం ఎక్కువైనది బావ విషయంలో ఆమె నిరాదరణ స్పష్టంగా కనిపించి పోతున్నది అది బావకి కనపడకుండా మాలతి తన శాయశక్తులా ప్రయత్నించి అతడికి ఏలోటు రాకుండా చూచేది. కాని అమ్మ ప్రవర్తనలో మార్పు బావ గ్రహించే ఉంటాడు

"బావ మునుపటిలాగ రావడం లేదేమమ్మా ?" అని మాలతి తల్లిని ప్రశ్నించి చూచింది కూడా.

"ఇంకా ఎందుకు వస్తాడు ? అతడికి మనకి ఏనాడో సంబంధం తెగిపోయింది రెండవపెళ్లి చేసుకొన్నాడంటే ఇక మనం ఎవరిమో, అత డెవరో" అన్నది తల్లి.

"మన ఆదరణలో అతడికి ఏదైనా తేడా కన్పించి రావడం మానేశాడేమో" అన్నది మాలతి

"అతడికి మనం ఏం లోటు చేశాం ? ఇంటికి వస్తే కాఫీ ఇవ్వలేదా, భోజనం పెట్టలేదా ? మీ నాన్నగారితో సమానంగా కుర్చీలో కూర్చొని అతడు మాట్లాడడంలేదా ? అదే ఆఫీసయితే ? మీ నాన్నగారు కూర్చొంటే అతడు నిలబడి మాట్లాడ వలసినవాడేనా ?" అన్నది తల్లి

మాలతి తెల్లబోయింది "అదేమిటమ్మా ? అతడు మన యింటి అల్లుడు ఇది ఇల్లు కాని, ఆఫీసుకాదు నాన్నగారు అతడికి అధికారి కూడా కాదు. అసలు ఎంత అధికార్లయినా ఇంటికి వచ్చిన తాబేదార్లని అవమానపరచరు. ఆ విషయం నీకు తెలియదేమో. ఇంతకీ అతడు తన బిడ్డని చూడ డానికి వస్తున్నాడు తిండికిలేక వస్తున్నాడా ? అతడు రెండవ వివాహం చేసుకోకపోవడానికి కారణం అతడికి అక్కపైన గల గాఢమైన అనురాగమే కారణమని నువ్వు గ్రహించలేదు అతడు రాన ప్పుడు మనమైనా ఒకసారి ఉత్తరం వ్రాయాలి." అన్నది మాలతి కొంత వేడితో.

# బావ

బాగుంది వరస. అక్క పోయాక అతణ్ణి మనం ఎందుకు రమ్మనాలి ? లోకం చెప్పుకోదా? నువ్వు శలవుల్లో ఇలా ఇంటికి వచ్చేదానివో లేదో, వెనకనుండి అతడు సిద్ధమయ్యేవాడు. ఇప్పుడు మునుపటిలాగ రావడం తగ్గించాడని నేను సంతో షిస్తున్నాను. ఉత్తరం వ్రాయడం కూడానా ? అతడు చూడకపోయినంతమాత్రాన పాపకి నష్ట మేమీ రాదు" అన్నది తల్లి.

మాలతి పెదవి విరిచింది అమ్మ వాదన లోకా చారాన్ని అనుసరించే ఉన్నది కాని, తనకేమో ఇదంతా నచ్చలేదు. అక్క చనిపోయినంతమాత్రాన బావ పరాయివాడై పోయాడా ? అక్కను వివాహం చేసుకోవడంతో అతడు తమ కుటుంబంలో ఒక మనిషి అయ్యాడు తమ ఇంట్లో ఎన్నో రోజులు గడిపాడు. తమతోబాటు కష్టసుఖాలు పంచు కొన్నాడు. ఈ బాంధవ్యం ఎలా తెగిపోతుంది ? అతన్ని మునుపటిలాగే ఎందుకు చూడకూడదు ? అతడు వచ్చి వెళ్తూంటే అక్క మరణించిన లోటు కొంత తమకే తగ్గినట్లు కనిపిస్తూంది అక్క చనిపోవడంతో పాపం బావ ఎంత దిగులు పడుతున్నాడో ! క్రిందటిసారి తను చూచినప్పటికి సగం మనిషి అయిపోయాడు అతణ్ణి ఆదరించి, అతడి మనస్సుకి కొంత శాంతిని సమకూర్చడానికి ప్రయత్నం చెయ్యాలని ఎవరికీ తోచదేం ? అతడు రెండవ వివాహం చేసుకోలేదన్న విశ్వాసం కూడా ఈ ఇంట్లో ఎవరికీ లేకపోయింది.

ట్రెయిను ఆగింది మాలతి దిగవలసిన స్టేషను వచ్చింది. ఒకసారి కళ్ళు తుడుచుకొని లేచింది.

బంట్రోతుతో సహా తండ్రి స్టేషనుకి వచ్చాడు.

"ఏమమ్మా పరీక్షలు ఎలా వ్రాశావ్ ?" అని ప్రశ్నించాడు.

"బాగానే వ్రాశాను నాన్నగారు. పాపని తీసుకు రాలేదా ?" అన్నది మాలతి.

"లేదమ్మా ఎండ మాడ్చివేస్తున్నది. అందుకని తీసుకురాలేదు"

మాలతి ఇల్లు చేరేసరికి పాప అరుగుమీద నిల్చొని నిరీక్షిస్తున్నది పిన్ని దిగగానే ఒక్క పరు గున వచ్చి పెనవేసుకొంది పాపని హృదయానికి హత్తుకొని మాలతి ముద్దుల వర్షం కురిపించింది.

"నువ్వు వత్తావనే చూత్తున్నాను" అని పాప చెప్పింది.

"నేను వస్తానని నీకు ఎలా తెలిసిందమ్మా ?" అన్నది మాలతి


"తాతారు చెప్పారు అందుకే బువ్వ కూడా తినలేదు" అన్నది పాప

"నేను వచ్చేశానా ? గభాలున స్నానం చేస్తాను. ఆ తర్వాత ఇద్దరం భోజనం చేద్దాం. ఇంట్లోకి పద" అన్నది మాలతి.

కుశలప్రశ్నలువేసి కాఫీ ఇచ్చింది తల్లి. తండ్రి ఎదురుగా కుర్చీలో కూర్చొన్నాడు

"ఏమిటి విశేషాలు ?" అని మాలతి అడిగింది.

"నీకొక శుభవార్త సిద్ధంగా ఉన్నది. త్రోవ లోనే చెప్పాలనుకొన్నాను. మంచి సంబంధం ఒకటి వచ్చింది అబ్బాయి ఆనర్సు ప్యాసయినాడు. ఈమధ్య జరిగిన పరీక్షలలో రైల్వేలో క్లాస్ వన్ ఆఫీసరుగా సెలక్షన్ వచ్చింది కుర్రవాడు లక్ష



'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్‌తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" × 2", 4" × 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. స॥

ప్రెసిడెంట్
వెజిటబుల్ హేర్ ఆయిల్
చక్కని, ప్రకాశవంతమైన
శిరోజాలను పెంచుతుంది
చల్లదనాన్ని ఇచ్చి, సేద దేరుస్తుంది.




శ్రీ రాథోడ్
ట్రేడింగ్ కంపెనీ,
మద్రాసు-1
EP-RTC-14

సరికొత్త రుచి
ఆరోగ్యానిచ్చే
అమర పానీయం

ఫ్రూటాల్




తయారు చేయువారు
ఇండియా
క్యానింగ్
యిండస్ట్రీస్
విజయవాడ-3.
NVKR

# బావ

ణంగా ఉన్నాడు బి ఏ. ప్యాసయిన అమ్మాయిని చేసుకొంటాడట. కట్నం ప్రసక్తి లేదట. అమ్మాయి నచ్చితే చాలునట. కాని, అతడి తల్లి తండ్రులు మాత్రం లోపాయకారీగా వో పది పది హేనువేలు రాబట్టాలని చూస్తున్నారట. ఏదో విధంగా స్థిరం చెయ్యాలనుకొంటున్నాం" అని చెప్పాడు తండ్రి

"నిన్న చూశాక తప్పకుండా ఆ అబ్బాయి నచ్చుతాడనే నా నమ్మకం" అన్నది తల్లి.

పాపకోసం తెచ్చిన వస్తువులు పెట్లోంచి బయటికి తీసింది మాలతి

పాప కళ్ళు ఆనందంతో మెరిశాయి. "పొద్దుట నాన్నగారు నాకు పళ్ళూ, గౌన్లూ అన్నీ తెచ్చారు. ఇప్పుడు మళ్ళీ నువ్వు తెచ్చావు" అన్నది

పెట్టె మూతవేసి వెనక్కి తిరిగింది మాలతి "ఏమిటమ్మా, బావ వచ్చాడా ? ఏడీ ?" అని తల్లిని ప్రశ్నించింది

"ఆఁ ! వచ్చాడమ్మా అదొక గొడవ" అన్నది తల్లి

"ఏం జరిగిందీ ?" అని ఆతృతగా ప్రశ్నించింది మాలతి

"పెద్ద విశేషం ఏమీలేదు ఇప్పుడే రైలు దిగి వచ్చావు స్నానంచేసి భోజనానికిలే. సావకాశంగా చెప్తాను" అన్నది తల్లి.

"అది కాదమ్మా గొడవ అంటున్నావ్ ? ఏమిటి జరిగిందో ఇప్పుడే చెప్పు" అన్నది మాలతి

"అతడు ఈ ఉదయం వచ్చాడు ఆమాట, ఈమాట అయ్యాక, తను వచ్చిన విషయం బయట పెట్టాడు అక్క చనిపోయాక తను తిరిగి వివాహం చేసుకోకూడదనే మొదట నిశ్చయించుకొన్నాడట కాని, ఈ మూడేళ్ల అనుభవంతో తెలుసుకొన్నాడట— ఏవిధంగా చూచినా తను ఇంకొక వివాహం చేసుకోక తప్పదని—"

"ఏమిటీ ? బావ రెండవ పెళ్ళి చేసుకొంటాడా ?" అన్నది మాలతి ఆశ్చర్యంతో

"తమాషా అంతా పూర్తిగా విను పాపను వదిలి తను జీవించలేక పోతున్నాడట. పాప అతడి వద్దనే ఉండాలట తను ఏ పరాయిపిల్లనో చేసుకొంటే ఆమె పాపని సరిగ్గా చూడకపోవచ్చునట. స్వర్గంలో ఉన్న మీ అక్కకి శాంతి లేకుండా పోతుందట అందుచేత బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడట నిన్నిచ్చి అతడికి వివాహం చెయ్యమని అడగడానికి వచ్చాడట అన్నివిధాలా అతడికి నువ్వే అనుగుణ్యమైన దానివట నీలో అక్కని చూసుకుంటాడట" మూతి తిప్పుతూ చెప్పింది తల్లి.

"నువ్వేమిటి అన్నావ్ ?" అని వెంటనే ప్రశ్నించింది మాలతి ఆమె తలలో ఏదో సుడిగుండం తిరగడం ప్రారంభించింది.

"ఏమిటి అన్నానో ఆమాత్రం గ్రహించలేవా ? ముప్ఫైఏళ్ళు దాటినవాడు. పైగా నాటికి నేటికి ఆ గుమాస్తా ఉద్యోగమే వెలగబెడుతున్నాడు. ఉన్న ఒక్కదానివి నిన్ను ఆ రెండో పెళ్ళివాడికి ఇస్తానా ? ఏమొహం పెట్టుకొని అడగడానికి వచ్చాడు ?" అన్నది తల్లి.

"పెద్దమ్మాయిని కడుపులో పెట్టుకొన్నాడు. ఈసారి నీకోసం చెయ్యి చాపుతున్నాడు" అన్నాడు తండ్రి

"అతడికి నువ్వు ఏమని సమాధానం చెప్పావ్ ?" అని స్వరం రెట్టించి అడిగింది మాలతి

"అలా చూస్తావేం ? అతడికి మర్యాదగానే జవాబు చెప్పాను. మా మాలతిని ఒక పెద్ద ఆఫీసరుకి ఇవ్వబోతున్నామని, సంబంధం మూడు వంతులు నిశ్చయమైపోయిందని చెప్పాను. అతణ్ణి నిరభ్యంతరంగా ఇంకొక అమ్మాయిని చూచి వివాహం చేసుకోమన్నాను. పాప మనవద్దనే ఉంటుందని, దానికోసం ఏమీ దిగులుపడవద్దని చెప్పాను" అన్నది తల్లి.

"బావ ఏమన్నాడు ?" అన్నది మాలతి.

"ఇంకొక సంబంధం ప్రసక్తి లేదన్నాడు. ఈ వివాహము తలపెట్టడంలో పాపని తన వద్దకు తీసుకుపోవడ మన్నది ఒక ముఖ్య కారణం' అన్నాడు అది ఇంకొకలాగ జరిగే అవకాశం లేదన్నాడు. మేము అంగీకరించకపోవడంతో తన చివరి ఆశ కూడా విఫలమైపోయిందని, ఇక తను ఈ ప్రపంచంలో ఎందుకు జీవించాలో కారణం కనపడడంలేదని అన్నాడు" అని తండ్రి చెప్పాడు.

"ఎంత ఘోరం బావ చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయాడా ?" అన్నది మాలతి హీనస్వరంతో

"ఏవో ఆశలు పెట్టుకొని వచ్చాడు పాపం చిన్నబుచ్చుకోడూ ? ముఖాన్ని నెత్తురులేదు ఒకసారి పాపని ఎత్తుకున్నాడు 'అమ్మా ! తాత, అమ్మమ్మగార్ల వద్ద బుద్ధిగా ఉండు' అని దానికి చెప్పాడు. కళ్ళు తుడుచుకొంటూ వెళ్ళిపోయాడు" అని చెప్పాడు తండ్రి

"అదిగో తనతో తెచ్చిన ఆ చేతి సంచి కూడా మరిచిపోయి వెళ్ళిపోయాడు" అన్నది తల్లి.

మాలతికళ్ళు నీళ్లతో నిండాయి "కనీసం నేను ఇవాళ వస్తున్నట్టు మీరు అతడితో చెప్పలేదా ?" అన్నది.

"చెప్పలేదు సుమా నువ్వు వచ్చేవరకు బైటాయిస్తాడని భయంవేసింది" అన్నది తల్లి

మాలతి కళ్ళు తుడుచుకుని దిగ్గున లేచింది. బావ చేతిసంచీ, తన పెట్టె, బెడ్డింగు వద్దకు చేర్చింది

"పాపా రా అమ్మా, నాన్నగారి వద్దకి వెడదాం" అన్నది

"అదేమిటే ?" అన్నారు తల్లి, తండ్రీ నిర్ఘాంతపోయి.

"ఇక ఒక్క నిముషం కూడా ఆలస్యం చెయ్యడానికి వీలులేదు నేను వారి వద్దకు పోతున్నాను. అక్క ఇల్లు నిలబెట్టవలసిన బాధ్యత నాది ఆనాడు కలలో అక్క ఏమిటి చెప్పిందో ఇప్పుడు నాకు స్పష్టమయింది నేనేదో త్యాగం చేస్తున్నానని మీరు భావించకండి అటువంటి అమృతహృదయుణ్ణి పొందడం నిజంగా నా అదృష్టం మేము ఏ అన్నవరమో వెళ్ళి దైవసన్నిధిని నిరాడంబరంగా వివాహం చేసుకొంటాం ముహూర్తం వెంటనే స్థిరపరచి ఉత్తరం వ్రాస్తాం మీకు రావాలని మనసారా కోర్కె కలిగితే తప్పకుండా రండి" అంటూ పాపని ఎత్తుకొని, రిక్షాకోసం వీధిలోకి వెళ్ళింది మాలతి. ★